



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక






సంపుటి: 16 | సంచిక : 68 | శుక్రవారం 26. 6. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


# తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లు ప్రారంభోత్సవం

## హాజరైన సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్

- కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లు
- రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు.
- జల వివాదాలను పరిష్కరించుకుందాం: సీఎం రేవంత్‌రెడ్డి
- నదుల అనుసంధానంతో గుజరాత్‌లో సమృద్ధిగా జలాలు: సీఆర్ పాటిల్
- రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం
- 73 ఏళ్ల క్రితం మట్టితో నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పటికీ బాగుందని చెప్పారు



బళ్లారి: కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు."తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనం తపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నా. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలను తీరుస్తుంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రస్తుత డ్యామ్‌లు ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్నాయని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. 73 ఏళ్ల క్రితం మట్టితో నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పటికీ బాగుందని చెప్పారు. "ఈ ప్రాజెక్టులో ఒక్క గేటు కొట్టుకుపోవడం వల్ల అన్ని గేట్లు మార్చాల్సిన పరిస్థితి వచ్చింది. నర్మద, సరోవర్ జలాలు మిళితం చేసి నదుల అనుసంధానం చేపట్టాం. ఈ ప్రక్రియతో గుజరాత్‌లో నదీజలాలు సమృద్ధిగా ఉన్నాయి. రూ.లక్ష కోట్లతో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 3 నదులు అనుసంధానం చేపట్టాం"



# ఉద్యోగులకు ఉచిత బీమా

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఉద్యోగులకు ఉచిత బీమా కల్పించేలా 14 బ్యాంకులతో ఒప్పందం
- ప్రమాద బీమా ద్వారా ఉద్యోగులకు రూ.కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకూ కవరేజి
- తాను గుంపు మేస్త్రీనే అని, మా మంత్రుల గుంపుకంతా మేస్త్రీనే..
- ఇక ఉద్యోగులకు పీఆర్సీ విషయంలో ఇచ్చిన మాటను కూడా నిలబెట్టుకుం

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**

ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులు సహా.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత బీమా కల్పించేలా సీఎం రేవంత్ రెడ్డి 14 బ్యాంకులతో వీశీఖ కుదుర్చుకుని, ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. రవీంద్రభారతిలో ఆయా వీశీఖలపై సీఎం సంతకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్థ లేదా ప్రభుత్వం కోసం కష్టపడేవారికి అండగా ఉండాల్సిన బాధ్యత యజమానిదేనన్నారు. దీనిని ఉద్యోగులు అడగకపోయినా ప్రభుత్వమే ఒకడుగు ముందుకు వేసిందన్నారు. ఉద్యోగులందరికీ ఇన్సూరెన్స్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా ఉద్యోగులు ఇన్సూరెన్స్ ప్రయోజనాలు పొందేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రమాద బీమా ద్వారా ఉద్యోగులకు రూ.కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకూ కవరేజి ఉంటుందని, విమాన ప్రమాదబీమాకు బ్యాంకులు రూ.2కోట్లు -రూ.3 కోట్లు బీమాను అందిస్తున్నాయని వివరించారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు.

**నేను గుంపు మేస్త్రీనే..**

తాను గుంపు మేస్త్రీనే అని, మా మంత్రుల గుంపుకంతా మేస్త్రీనే అని.. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తన గుంపులో ఉన్నవారంతా రాష్ట్రం కోసం ఎంతో కష్టపడుతున్నారన్నారు. తాను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చినవాడినేనని, ఆయ కుటుంబాల్లో కష్టాలెలా ఉంటాయో తెలుసన్నారు. హోదా, పదవులు మారినా, ప్రజలతో తనకున్న అనుబంధం మాత్రం మారదన్నారు. ఆనాడైనా, ఈనాడైనా తనను రేవంతన్న అని పిలిస్తేనే ఇష్టమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఒక గంట అదనంగా పనిచేద్దామని ఉద్యోగులను సీఎం కోరారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా పనిచేస్తే.. ఆ ఆదాయాన్ని ఉద్యోగుల కోసమే ఉపయోగిస్తామన్నారు. గత ప్రభుత్వం ఒకటోతారీఖు కాదుకదా.. పదోతేదీ వచ్చినా జీతాలివ్వలేని పరిస్థితి కల్పించిందని, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక ఉద్యోగులకు ఫస్ట్ తేదీనే జీతాలిస్తున్నామని తెలిపారు.

## తెలంగాణ పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- ఫలితాలను విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్
- సప్లిమెంటరీ పరీక్షల్లో 82.61 శాతం ఉత్తీర్ణత
- పరీక్షలు రాసిన 27,857 మందిలో 23,103 మంది విద్యార్థులు ఉత్తీర్ణతు

## ఖైరతాబాద్ మహాగణపతి కర్రపూజ..

- ఈసారి గణనాథుడి లుక్ ఇదే
- గణపతి నమూనా పోస్టర్ ను విడుదల చేసిన దానం
- ఈసారి పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో స్వామి వారు భక్తులకు దర్శనం



## అంత్యోదయ'లో మార్పులు.. ఇకపై వ్యక్తికి 7 కేజీల రేషన్

దిల్లీ: అంత్యోదయ అన్న యోజనలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురానుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఈ పథకం లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 7 కిలోల ఆహారధాన్యాలు ఇచ్చేలా పథకంలో మార్పు చేయబోతోంది. 35 కిలోల గరిష్ఠ పరిమితిని మాత్రం యథాతథంగా కొనసాగించాలనుకుంటోంది. ఈ మేరకు జాతీయ ఆహార భద్రత చట్టం, 2013ను సవరించాలని భావిస్తోంది. దీనిపై జులై 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది.

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల
- ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికం
- రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలి
- ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

# రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టిండు

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో రియల్ ఎస్టేట్ గురించి గొప్పలు చెప్పుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేడు ఆ రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి తనను తాను రియల్ ఎస్టేట్ నిపుణుడిగా చెప్పుకున్నారు. కానీ రెండున్నరేళ్ల పాలనలో లక్షలాది మంది ఉపాధి ఆధారమైన రియల్ ఎస్టేట్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు. ఎన్నికలకు ముందు కోటి రూపాయలు పలికిన ఎకరం భూమి నేడు రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు" అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ పేర్కొన్నారు. షాబాద్ పరిసర ప్రాంతాలైన చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకువచ్చామని చెప్పారు. "ఒకప్పుడు ఎకరం రూ.30 లక్షలు ఉన్న భూమి, పరిశ్రమల అభివృద్ధి వల్ల రూ.3 కోట్లకు పైగా చేరింది. కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది" అని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం పాలన పూర్తయినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాలు వంటి అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శించారు

- కేసీఆర్ హయాంలో పరిశ్రమలు -- భూముల విలువ పెరిగింది
- ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు
- తెలంగాణ అభివృద్ధి కోసం మళ్లీ కేసీఆర్ అవసరం
- కేటీఆర్‌కు ఘన స్వాగతం





- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ వాయిదా
- బీఆర్ఎస్ నుంచి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు
- పార్టీ మారలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ గతంలో తీర్పు
- స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. పలువురు ఎమ్మెల్యేలు పిటిషన్లు దాఖలు
- దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలంటూ ఏలేటి పిటిషన్
- పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు.. తదుపరి విచారణను జులై 22కు వాయిదా

## వెనెజువెలా భూకంపాలు 32 మంది మృతి

- ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం
- వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం
- ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారు

# విద్యార్థులకు క్షమాపణ చెప్పి.. కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో దేశంలో లక్షలాది మంది యువత భవిష్యత్ అంధకారం
- 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడానికి కేంద్ర విద్యాశాఖ మంత్రే బాధ్యత

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**

దేశంలో పేపర్ లీకేజీల వ్యవహారం ఇప్పుడు తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో దేశంలో లక్షలాది మంది యువత భవిష్యత్ అంధకారంలోకి వెళ్లి పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ మొత్తం ఒక దోపిడీ రాకెట్‌లా మారిపోయిందని రాహుల్ ఆరో పించారు.





## అస్థవ్యస్తంగా తయారైన ట్రాఫిక్ రూల్స్

**ఎల్లారెడ్డి జూన్ 25 తెలంగాణ వాణి ప్రతినిధి**

అధికారుల పర్యవేక్షణ లేక ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ మొత్తం అస్థవ్యస్తంగా తయారయింది. ఒకవైపు రహదారి పనులు మరోవైపు యదేచ్చగా రోడ్డుపైనే వాహనాల నిలిపివేత పరిమితిని మించి ఆటోలో తరలించడం టు వీలర్ వెహికల్ పై ముగ్గురు నుండి నలుగురు ప్రయాణించడం కొంతమంది యువకులు స్పోర్ట్స్ బైక్ తో రహదారిపై అత్యధిక స్పీడ్ తో వెళుతున్న వాహనాలు... ఇలా ఒక్కటేమిటి ట్రాఫిక్ రూల్స్ ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో లెనేలేవు అన్నవిధంగా తయారైంది. యదేచ్చగా ఎవరికి వారు మాకు ఆడిగేవారే లేరు అన్నట్టుగా రోడ్డుపైనే వాహనాలు నిలిపి ప్రయాణికులకు చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం,పైపెచ్చు ట్రాఫిక్ లేకపోవడంతో వాహనం దారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాదాచారుల బాధలు వర్ణనాతీతం, అంబేద్కర్ చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులతో రోజు నరకయాతన పడవలసి వస్తుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఎవరి ఇష్టానుసారంగా వారు వాహనాలు నడిరోడ్డుపైనే నిలిపి గంటలతరబడి షాపింగ్ చేస్తుండడం తో రాకపోకలకు చాలా అంతరాయం ఏర్పడుతుంది దీనికి తోడు చెరుకు రసపు బండ్లు, అరటిపండ్ల పండ్లు,15 నుండి 20 మందిని నింపుకొని వెళ్తున్న ఆటోలు ఇలా ఒకటేమిటి ఎవడికి నచ్చినట్టు వాడు ప్రయాణికులకు చాలా ఇబ్బందులకు చేస్తున్నారు. ఏ ఒక్క అధికారి పర్యవేక్షణ లేక పోవడం వల్లే ఇలా ఇబ్బందులు పడుతున్నామని జనాలు, ప్రయాణికులు అనుకుంటున్నారు.ఇకనైనా అధికారులు స్పందించి ఇలా ట్రాఫిక్ రూల్స్ లను అతిక్రమిస్తున్న వాహనదారులను పై కఠిన చర్యలు తీసుకొని ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేక యాక్సిడెంట్లు కాకుండా కాపాడాన్ని ఎల్లారెడ్డి పట్టణ ప్రజలు కోరుచున్నారు.

## బాధితులకు ఆర్థిక సహాయం అందించిన మాజీ జెడ్పీటీసీ ఉషా గౌడ్



**ఎల్లారెడ్డి జూన్ 25 తెలంగాణ వాణి ప్రతినిధి**

ఎల్లారెడ్డి మండలం సాతెలి గ్రామానికి చెందిన కల్లేటి మైసయ్య నివాసపు గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయి సర్వస్వం కోల్పోయినారు విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి ఉషా గౌడ్ బాధితులకు ఆర్థిక సహాయం ఐదువేల రూపాయలు అందజేశారు మరియు ఎమ్మెల్యేతో మాట్లాడి ఇందిరమ్మ గృహాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు ఇట్టి కార్యక్రమంలో సాతెల్లి సర్పంచ్ రాధా నాగరాజ్ రేపల్లెవాడ గ్రామ సర్పంచ్ వనిత సాయిరాం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ప్రమాద బీమా పథకానికి శ్రీకారం

### -కార్యక్రమంలో పాల్గొన్న టీఎన్జీవో జిల్లా నేతలు




**మంచిర్యాల, జూన్ 25 (తెలంగాణ వాణి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రమాద బీమా భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు బ్యాంకుల మధ్య ఉద్యోగుల ప్రమాద బీమా పథకం ఒప్పంద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1 కోటి నుంచి రూ.2 కోట్ల వరకు బీమా రక్షణ వర్తించేలా ఒప్పందం కుదిరింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు మారం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుస్సేన్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, మాజీ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడిన టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి, ఈ ప్రమాద బీమా పథకం కేవలం శాశ్వత ఉద్యోగులకు మాత్రమే కాకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తించడం అభినందనీయమన్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థిక భద్రత కలుగుతుందని పేర్కొన్నారు.ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ బీమా సౌకర్యాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి వర్గం, టీజీఈజేఏసీ నాయకత్వానికి టీఎన్జీవో మంచిర్యాల జిల్లా తరపున శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు.

## వికలాంగ పిల్లలకు విద్యే భవిష్యత్‌కు బాట ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**నిర్మల్ - భైంసా: జూన్ 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో స్నేహా సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "వికలాంగుల బడి బాట--2026" కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్త్రాత్రి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వికలాంగ పిల్లలకు విద్య, వైద్యం,పునరావాస సేవలు అందించడం సమాజ బాధ్యత అని అన్నారు.ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సహాయ పరికరాలు, విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి విద్యావంతులను చేయాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. వికలాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సుభాష్,మున్సిపల్ కౌన్సిలర్లు ప్రవీణ్,మహేష్, సుభాష్ ప్రజాప్రతినిధులు,అధికారులు, ప్రత్యేక పాఠశాలల నిర్వాహకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇమామ్ హుస్సేన్ స్మరణలో మొహర్రం

- హిందూ--ముస్లింల సౌభ్రాతృత్వానికి ప్రతీక
- జిల్లాలో భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు ఏర్పాట్లు





**మంచిర్యాల, జూన్ 25 (తెలంగాణ వాణి):**

ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే మొహర్రం సందర్భంగా మంచిర్యాల జిల్లాతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణలో మొహర్రం వేడుకలను స్థానికంగా "పీర్ల పండుగ"గా పిలవడం ప్రత్యేకత. ఈ వేడుకల్లో ముస్లింలతో పాటు హిందూ సమాజానికి చెందిన ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొంటూ మత సామరస్యాన్ని చాటుకుంటున్నారు. మొహర్రం అనేది సాధారణంగా పండుగగా పిలిచినా, వాస్తవానికి ఇది ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొలి నెల. ఈ నెలలో పదవ రోజైన "ఆషూరా"కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఇస్లాం చరిత్రలో జరిగిన కర్బలా సంఘటనకు గుర్తుగా ఈ రోజును స్మరించుకుంటారు.ముస్లిం మత పెద్దల కథనం ప్రకారం, మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ సత్యం, న్యాయం, ధర్మం కోసం పోరాడుతూ ఇరాక్‌లోని కర్బలా ప్రాంతంలో వీరమరణం పొందారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, అనుచరులు కూడా అమరులయ్యారు. ఈ సంఘటన ఇస్లాం చరిత్రలో త్యాగం, న్యాయం, ధైర్యానికి ప్రతీకగా నిలిచింది. మొహర్రం తొలి పది రోజులను ముస్లింలు సంతాప దినాలుగా పాటిస్తారు. ముఖ్యంగా తొమ్మిదో, పదో రోజుల్లో ప్రార్థనలు, ఉపవాసాలు, మత ప్రవచనాలు నిర్వహిస్తూ ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకుంటారు.తెలంగాణలో ఈ వేడుకలకు ప్రత్యేక గుర్తింపుగా పీర్లు లేదా పంజాలు ఏర్పాటు చేస్తారు. గ్రామాలు, పట్టణాల్లో పీర్లను అందంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. భక్తులు షర్బత్, మలిదా వంటి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం పీర్లను ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్తారు .ముఖ్యంగా పీర్ల పండుగలో హిందూ--ముస్లిం ప్రజలు కలిసి పాల్గొనడం తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రజలు వేడుకల్లో పాల్గొంటూ పరస్పర గౌరవం, ఐక్యతను చాటుకుంటున్నారు.కొన్ని ప్రాంతాల్లో పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానాలు, షర్బత్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రార్థనలు చేస్తున్నారు. ముస్లిం మత పెద్దల ప్రకారం మొహర్రం కేవలం ఒక మతపరమైన ఆచారం మాత్రమే కాకుండా త్యాగం, న్యాయం, మానవతా విలువలను గుర్తుచేసే సందర్భంగా భావిస్తారు. సమాజంలో శాంతి, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే సందేశాన్ని ఈ పీర్ల పండుగ అందిస్తుందని పేర్కొంటున్నారు.ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధల మధ్య మొహర్రం--పీర్ల పండుగ వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

# ఆదిలాబాదు లో జులై 3న హెచ్‌సీఎల్ 'టెక్‌బీ' మెగా జాబ్ మేళా

**జిల్లా కలెక్టర్ రాజార్షి షా**



**ఆదిలాబాద్, జూన్ : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**

ఐటీ రంగంలో స్థిరపడాలనుకునే జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక సువర్ణావకాశం లభించింది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ 'హెచ్‌సీఎల్ టెక్నాలజీస్' ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'టెక్‌బీ' ప్రోగ్రామ్ కోసం జులై 3వ తేదీ శుక్రవారం ఆదిలాబాద్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారనీ జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. గతంలో మన జిల్లాకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు ఈ ప్రోగ్రామ్ ద్వారా హెచ్‌సీఎల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారని ఆయన గుర్తుచేశారు. ఇంటర్ అర్హతతోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో పాటు ఉన్నత చదువులు చదువుకునే ఈ అద్భుత అవకాశాన్ని అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ ఉద్యోగ మేళా జులై 3న శుక్రవారం ఉదయం 9:00 గంటల నుండి ఆదిలాబాద్‌లోని పాలిటెక్నిక్ కాలేజ్ రోడ్డులో ఉన్న టీటీడీసీ (సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం) భవనంలో ప్రారంభమవుతుందని, 2025- 2026 మధ్య విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ మేళాకు హాజరుకావడానికి అర్హులు. దీనికి ఎంపీసీ , యంఈసీ , సీఈసీ , బైపీసీ (ఒకేషనల్ కంప్యూటర్స్ లేదా రిటైల్ మానేజ్మెంట్ ) గ్రూపుల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ , యంఈసీ విద్యార్థులకు ఇంటర్‌లో 80 శాతం మార్కులు ఉండటంతో పాటు, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో విడిగా 80 శాతం మార్కులు తప్పనిసరిగా సాధించి ఉండాలి. అలాగే సీఈసీ , ఒకేషనల్ కంప్యూటర్స్, రిటైల్ మేనేజ్‌మెంట్ గ్రూపుల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించి ఉండటం అవసరం.ఈ జాబ్ మేళాకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట పదో తరగతి పాస్ సర్టిఫికెట్ నకలు, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా నకలు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలనీ, వీటితో పాటు ఆన్‌లైన్ పరీక్ష లేదా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం అభ్యర్థులు ఒక ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ను కూడా వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పూర్తి వివరాల కోసం హెచ్‌సీఎల్ ప్రతినిధులను 8074065803 లేదా 9701665424 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

# బెల్లంపల్లిలో సీఎండీతో టీఆర్‌వీకేఎస్ భేటీ

**-కార్మికుల సమస్యలపై వినతి--సానుకూలంగా స్పందించిన సీఎండీ**



**మంచిర్యాల, జూన్ 25 (తెలంగాణ వాణి):**

బెల్లంపల్లి డివిజన్ పర్యటనలో భాగంగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ ఇంధన శాఖ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి (ఐఏఎస్)ని టీఆర్‌వీకేఎస్ హెచ్--58 ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కార్మికులకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమానికి రీజినల్ సెక్రటరీ,స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముష్క నర్సయ్య నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి డివిజన్‌లో ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సీఎండీకి వివరించారు.ముఖ్యంగా డివిజన్‌లో తీవ్ర సిబ్బంది కొరత నెలకొన్నందున ఉద్యోగులపై పనిభారం పెరిగిందని, దీని కారణంగా సేవల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేసి సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు.అదేవిధంగా పాత మంచిర్యాల నుంచి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్ పొడవు అధికంగా ఉండడం వల్ల సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. ముఖ్యంగా మందమర్రి పాలచెట్టు ప్రాంతం వరకు ఉన్న 33 కేవీ లైన్ నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.టీఆర్‌వీకేఎస్ నాయకులు తెలిపిన సమస్యలను సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శ్రద్ధగా విని సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డివిజన్ అధ్యక్షుడు బి. దామోదర్ రాజు, మంచిర్యాల డివిజన్ కార్యదర్శి ఎస్. వినోద్, బెల్లంపల్లి డివిజన్ ప్రతినిధులు, అలాగే మంచిర్యాల జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజన్న, బెల్లంపల్లి ఇన్‌చార్జ్ డీఈ మల్లేశం, ఏడీ టౌన్ బెల్లంపల్లి కాటం శ్రీనివాస్, రూరల్ ఏడీ రవికుమార్, ఏఈ టెక్నికల్ బెల్లంపల్లి డివిజన్ అధికారులు ,సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజంకై పాటుపడాలి

**మందమర్రి, జూన్ 25 (తెలంగాణ వాణి విలేకరి)**




మందమర్రి పట్టణంలోని సింగరేణి కాలరీస్ ఎయి డెడ్ హైస్కూల్ ప్రాంగణం లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై 'ఈగల్ ఫోర్స్ తెలంగాణ' పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురు వారం భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్స వాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్య క్రమానికి బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మంద మర్రి సీఐ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు.?ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లా డుతూ, నేటి యువత దేశానికి వెన్నెముక వంటి వారని, అలాంటి విద్యార్థి లోకం గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడి తమ బంగారు భవి ష్యత్తును నాశనం చేసు కోవద్దని పిలుపు నిచ్చా రు. మత్తు పదార్థా లకు దూరంగా ఉంటూ, క్రమశి క్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. విద్యార్థి దశలోనే లక్ష్యా లను నిర్దేశించుకుని, ఉన్నత శిఖరాలను అధి రోహించాలని అన్నారు డ్రగ్స్ గంజాయి రహిత సమాజం కోసం ప్రతి ఒకరు పాటు పడాలని సూచించారు.సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాం క్షించారు. ప్రతి విద్యార్థి చదువు యొక్క ప్రాధాన్యతను గుర్తిం చాలని, తల్లిదండ్రు లు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని అన్నారు.సరైన కెరీర్ ప్లానింగ్ ద్వారా జీవితంలో అనుకున్నది సాధించవ చ్చని ఉద్ఘాటించారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగా నికి సంబంధించిన సమా చారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ నంబర్ 1908 కు సమాచారం అందించాలని పిలుపుని చ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడు తాయని తెలిపారు.

**డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ, పోస్టర్ల ఆవిష్కరణ:**

కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బందితో కలిసి అధికారులు 'మాదకద్ర వ్యాలకు నో చెపుదాం - జీవితానికి ఎస్ చెపుదాం' అంటూ చేతులు చాచి ఘనంగా ప్రతిజ్ఞ చేయిం చారు. అలాగే డ్రగ్స్ వల్ల మానవ శరీర భాగాలపై పడే దుష్ప్రభావాలను వివరించేలా రూపొందిం చిన పలు అవగాహన పోస్టర్లను అధికారులు, పాఠశాల యాజమాన్యం కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంద మర్రి ఎస్ఐ నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిచే పాఠశాల ఆకస్మిక తనిఖీ

**నిర్మల్, జూన్ 25(తెలంగాణ వాణి ప్రతినిధి)**

నిర్మల్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల (నిర్మల్ బాలురు), సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో, ప్రాజెక్టు అధికారి మందమకరందు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో ఆయన పాఠశాల రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను పరిశీలించారు. అలాగే వంటగది, భోజనశాల మరియు మరుగుదొడ్ల పరిస్థితులను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలంటూ ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక అభివృద్ధి దృష్ట్యా ఆహారంలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన ప్రాజెక్టు అధికారి మందమకరందు వారికి ప్రేరణాత్మక పాఠాలు బోధించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేయాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. ాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో నీటి నిలువ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నీటి నిల్వ వల్ల దోమలు పెరిగే అవకాశం ఉందని, తద్వారా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుందని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా, వంటగది ఆవరణలో పోషక విలువలు గల ఆకుకూరలు మరియు కూరగాయల మొక్కలను పెంచాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఎటువంటి రాజీ లేకుండా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరం.. ప్రగతికి బాటలు: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, జూన్ 25(తెలంగాణ వాణి ప్రతినిధి)**
నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపునిచ్చారు. 'మిషన్ పరివర్తన'లో భాగంగా స్థానిక దీక్ష జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పెహచాన్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత యాంత్రిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా యువత మత్తు పదార్థాల బారిన పడుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావడం అంటే జీవితాన్ని నాశనం చేసుకోవడమేనని, దీని నుంచి బయటపడటానికి యువత దృఢ సంకల్పంతో ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు బానిస కాకుండా, విలువైన సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని, గొప్ప శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తల



జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. పేదరికం, చదువుల ఒత్తిడి, ఇతరులతో అనవసరమైన పోలికల వల్లే మానసిక ఆందోళనకు గురై యువత తప్పుడు మార్గాల్లో పయనిస్తున్నారని కలెక్టర్ విశ్లేషించారు. వ్యతిరేక ఆలోచనలు రాకుండా, అభ్యాసంలో నిమగ్నమై ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారి



సందేహాలకు సమాధానాలిచ్చారు. అనంతరం అందరితో కలిసి నషా ముక్త్ భారత్ (మత్తు రహిత భారత్) కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి పరశురాం, మానసిక వైద్యులు అల్లాడి సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా సమాజ రక్షణలో భాగస్వామి కావాలి

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, జూన్ : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా వ్యవహరిస్తూ మత్తు పదార్థాల నిర్మూలనలో భాగస్వామి కావాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, మత్తు వ్యసనాల బారిన పడిన వారిని సమాజంలో తిరిగి సాధారణ జీవితానికి తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులకు డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించి వారిని ఆరోగ్యవంతమైన జీవితంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం, పోలీసు శాఖ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువత లక్ష్యాలు, ఆశయాలపై దృష్టి పెట్టకుండా మత్తు పదార్థాల వైపు మళ్లితే వారి



భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. నార్కో టెర్రరిజం ద్వారా దేశ వ్యతిరేక శక్తులు యువతను తప్పుదోవ పట్టించి సమాజాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తు న్నాయని, అలాంటి శక్తులను అణచివేయడంలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశ అభివృద్ధికి యువత శక్తి ఎంతో ముఖ్యమని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సాగు చేస్తున్న వారి వివరాలు గుర్తించి సంబంధిత ప్రభుత్వ శాఖలకు నివేదించడం ద్వారా ప్రభుత్వ పథకాల అర్హతలపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంటు ఒదని వివరించారు. అలాగే విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పోటీ ప్రపంచంలో రాణించే విధంగా విద్యాభ్యాసం కొనసాగించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులతో కలిసి సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ, కళాశాల భోజనశాల, విద్యార్థులకు అందజేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి "డ్రగ్స్‌కు నో -- జీవితానికి యెస్", "గంజాయి రహిత ఆదిలాబాద్" అనే నినాదా లతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక నష్టాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, పట్టణ సీఐ బి. సునీల్ కుమార్, ఎస్సై సంజయ్, కళాశాల ప్రిన్సిపాల్ మారుతి శర్మ, సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, యోగేష్ దీక్షిత్, అధ్యాపకులు, విద్యార్థులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పటాన్ చెరులో ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశం

**- ఏఈఆర్‌వోలతో సమావేశమైన అదనపు కలెక్టర్ పాండు**

**పటాన్ చెరు, జూన్ 25 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై సంగారెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు గురువారం పటాన్ చెరు తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.
40-పటాన్ చేరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్‌వోలు)తో సమావేశమైన అదనపు కలెక్టర్, ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఫారాల పంపిణీ, ఓటరు వివరాల ధృవీకరణ, క్షేత్ర స్థాయి పరిశీలన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అనర్హుల వివరాల తొలగింపులో పూర్తి స్థాయి



పరిశీలన జరపాలని ఆదేశించారు. బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు సమన్వయంతో పని చేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. సమావేశంలో పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన ఏఈఆర్‌వోలు, ఎన్నికల శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఉప సర్పంచులు మహాధర్నా

**ధర్నాలో పాల్గొన్న హుజురాబాద్ ఉప సర్పంచ్ లు ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజి..20 గ్రామాల ఉప సర్పంచ్ లు.**

**హుజురాబాద్, జూన్ 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :**
హుజురాబాద్ మండల ఉప సర్పంచ్ లు ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజి..20 గ్రామాల ఉప సర్పంచ్ లు ఈ ధర్నాలో పాల్గొన్నారు. హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద ఉప సర్పంచ్ లు రాష్ట్ర ప్రభుత్వం చక్ పవర్ రదు చేయతల పెట్టిన సందర్భంగా తెలంగాణలో ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, సమస్యల పరి ష్కారం కోసం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద హాలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ పేరుతో సర్పంచుల ఫోరం, ఉప సర్పంచుల సంఘం ఆధ్వర్యం లో మహాధర్నా నిర్వహించడం జరిగింది.

**ఉప సర్పంచుల ముఖ్యమైన వివరాలు.. ప్రధాన డిమాండ్లు.**
ఉప సర్పంచులకు సంబంధించిన చెక్ పవర్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించు కోవడం, గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణ హాజరు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో సర్పంచులు, ఉప సర్పంచులు ఈ మహాధర్నాకు తరలి వచ్చారు. గ్రామ పంచాయతీల చెక్ పవర్ రద్దు ప్రతి పాదనలు, నిధుల కొరతపై సర్పంచుల ఫోరం జేఏసీ గత కొంతకాలంగా ప్రభుత్వంపై ఒత్తిడి



తెస్తోంది. ఈ ధర్నాకు సంబంధించిన పూర్తివివరాలు, మీడియా కథనాలను హాలో ఉప సర్పంచ్ లు ఈ ధర్నాను విజయవంతం చేయడం జరిగినది.

**తెలంగాణలో ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, సమస్యలు పరిష్కరించాలి.**
తెలంగాణలో ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద హాలో ఉప సర్పంచ్ - చలో హైదరాబాద్ పేరుతో సర్పంచుల ఫోరం ఉప సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించడం జరిగినది.

# బండ్లగూడలో సర్ ప్రక్రియ పరిశీలన

**అదనపు కలెక్టర్‌తో కలిసి పర్యటించిన మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్**

**పటాన్ చేరు, జూన్ 25 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో అదనపు కలెక్టర్ పాండు పర్యటించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ అదనపు కలెక్టర్ పాండును మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక పరిస్థితులను వివరించారు. బండ్ల గూడ ప్రాంతంలో ఉపాధి నిమిత్తం వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాశ్వత నివాసం ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నారని ఆయన తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఓటును అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని, ఓటును తొలగించే ముందు సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని యాదగిరి యాదవ్ అధికారులను కోరారు. ఓటర్ల హక్కుల కు ఎలాంటి భంగం కలగకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అధికారులు



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి కూడా వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, తహసీల్దార్లు హరిబాబు, సరస్వతి, ఎన్నికల సిబ్బంది, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు..



## ఎస్ఐ ఆర్ ప్రక్రియను ప్రారంభించిన ముష్టిపల్లి గ్రామ బిఎల్వోలు

**నాంపల్లి జూన్ 25( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామంలో ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు నల్లగంటి సరస్వతి,ఆలంపల్లి పద్మ లు పాల్గొని ఓటర్లకు ఎస్ఐఆర్ మీద అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమం 2002 లో జరిగి మళ్ళీ కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం తీసుకొచ్చింది,ఈ ప్రక్రియలో ఫారం ఆరు కొత్త ఓటరుగా,ఫారం ఏడు ఓటును తొలగించడం కోసం,ఫారం ఎనిమిది ఓట్లలో మార్పుల కోసం ఇవ్వడం జరుగుతుంది, ఎన్యూమరేషన్ ఫారం తీసుకుని ఓటర్ వివరాలు పూర్తిగా నింపాలని ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు.ఈ పక్రియ జూలై ఇరవై నాలుగు వరకు ఉంటుందని బి ఎల్ ఓ నల్లగంటి సరస్వతి ఆలంపల్లి పద్మలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల బిఎల్ఎలు మరియు ఓటర్లు మరియు యువత పాల్గొన్నారు.

## జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఇన్వెస్టర్ సెరిమనీ ఘనంగానిర్వహించారు



**హైదరాబాద్/ శేరిలింగంపల్లి జూన్ 25(తెలంగాణవాణి విలేకరి)**
మదీనాగూడ లో ఇన్వెస్టిచర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఇన్వెస్టర్ సెరిమనీకి లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కుమార్ రెడ్డి కమాండింగ్ ఆఫీసర్, టీ ఆర్టిలరీ బ్యాటరీ తెలంగాణ ఎన్ సి సి పాల్గొన్నారు విశిష్ట అతిథులుగా అరుణ్ కుమార్ నందిత ప్రకాష్ పాఠశాల వ్యవస్థాపకులు చైర్మన్ జయపాల్, డైరెక్టర్లు అనన్య,అవినాష్, ప్రిన్సిపాల్ నళిని పాల్గొన్నారు ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు చైర్మన్ జైపాల్ మాట్లాడుతూ ఇన్వెస్టిచర్ సెరిమనీ అనేది విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఈ రోజు ఎన్నికైన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను స్వీకరించి, పాఠశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేయబోతున్నారని తెలిపారు నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులను వేదికపై ఆహ్వానించి బ్యాడ్జీలు సాష్‌ల ప్రదానం చేశారు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి మార్గదర్శకత్వం వహించిన ఎస్.ఎం. రాజీవ్ సర్. సి.ఓ గీతా జోసెఫ్, టీ గర్ల్స్ బెటాలియన్ ఎన్ సి సి తెలంగాణ 2.ఓ రవి కుమార్ టీ ఆర్టిలరీ బ్యాటరీ ఎన్ సి సి హైదరాబాద్ గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, జూన్ 25( తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బైంసా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాలను సందర్శించి వాటి ప్రస్తుత స్థితిగతులను పరిశీలించారు. ఈ వారాంతంలో జరగనున్న మంత్రి పర్యటన సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు బైంసా మున్సిపాలిటీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి, మున్సిపల్ కమిషనర్ సిద్ధిఖా కుతిజా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించేది లేదు

**భూ భారతి దరఖాస్తులను 60రోజుల్లోగా పరిష్కరించాలి:**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, జూన్ 25(తెలంగాణ వాణి ప్రతినిధి)**
కలెక్టరేట్‌లో అన్ని విభాగాల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల సూపరిండెంట్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి కింద స్వీకరించిన దరఖాస్తులను నిర్దేశిత గడువు 60 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి విభాగానికి సంబంధించిన రికార్డులను క్రమం తప్పకుండా పరిశీలించి, ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు సక్రమంగా భద్రపరచాలని సూచించారు. కలెక్టరేట్ ఉద్యోగుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని హెచ్చరించారు. ప్రతి విభాగం పరిధిలోని ఉద్యోగుల వివరాలు, పెండింగ్ అంశాలపై సమగ్ర సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, వివిధ విభాగాల సూపరిండెంట్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఆదిలాబాద్‌ను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం:

**కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, జూన్ : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
మాదకద్రవ్యాల ముప్పు నుండి యువతను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. గురువారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'మిషన్ పరివర్తన్ - నషా ముక్త్ భారత్ సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకుముందు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి జడ్పీ సమావేశ మందిరం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీనీ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యసనానికి బానిసైతే బంగారు భవిష్యత్తు చిన్నాభిన్నం కావడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధితులను మార్చేందుకు 'డవ్' స్వచ్ఛంద సంస్థ, రిమ్స్ ఆసుపత్రి వేదికగా డీ-అడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే రైతు భరోసా, రుణమాఫీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేస్తామని, ఇప్పటికే పలువురు నిందితులకు లబ్ధిని నిలిపివేశారని చేశామని స్పష్టం చేశారు. గతంలో ఉన్న నక్సలిజం కంటే ప్రస్తుతం డ్రగ్స్ మహమ్మారి రూపంలోనే పెద్ద ముప్పు పొంచి ఉందన్న డీజీపీ మాటలను ఆయన గుర్తుచేశారు. దీనిని అడ్డుకునేందుకు గ్రామ స్థాయిలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఆరోగ్య పాఠశాల విధానంలో భాగంగా ప్రతి గురువారాన్ని డ్రగ్స్ వ్యతిరేక అవగాహన దినంగా కేటాయించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ, అవసరమైతే పోలీస్, సంక్షేమ శాఖల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించాలని, జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం నషా ముక్త్ భారత్ భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేసి, డవ్ పునరావాస కేంద్రంలో మార్పుపొందిన బాధితుల కుటుంబాలను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమం, ర్యాలీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వైద్యారోగ్యశాఖ అధికారి డా.సాధన, కౌన్సిలర్ శ్రీనివాస్, ఇతర అధికారులు, యువత, విద్యార్థులు, అంగన్వాడిలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల చర్య -- రెండు ట్రాక్టర్లు సీజ్



**ఇల్లంతకుంట, జూన్ 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :**
ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై క్రాంతికుమార్ మాట్లాడుతూ, విలాసాగర్ గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు హాజరైన వొడితల ప్రణవ్





**హుజురాబాద్, జూన్ 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరంగా మారిందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ మండలం రాంపూర్, కమలాపూర్ మండలం గుండేడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తై లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు అందరూ కృషి చేయాలి: ఎస్సై కాంత్రి



**ఇల్లంతకుంట, జూన్ 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :**
అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందకుంట ఎస్సై కాంత్రికుమార్ హాజరై ప్రజలకు, యువతకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. సరదాగా ప్రారంభమైన అలవాటు వ్యసనంగా మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. యువత మంచి ఆలోచనలు కలిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం చాలా కష్టమని, మత్తు ప్రభావంతో వ్యక్తి తన ప్రవర్తనపై నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పరకాల క్రాస్‌రోడ్డు వద్ద పోలీసుల మెరుపు తనిఖీలు

### మహారాష్ట్ర నుంచి గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్!





**హుజురాబాద్,జూన్ 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి) :**
హుజూరాబాద్ పట్టణంలోని పరకాల క్రాస్‌రోడ్డు వద్ద పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం, హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన టేకుమట్ల రాజేష్‌తో పాటు వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన రబ్బానీ, షేక్ ఫరూక్ మహారాష్ట్ర నుంచి హుజూరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన వారిని తనిఖీ చేయగా వారి వద్ద 110 గ్రాముల గంజాయి లభ్యమైంది.దీంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ కరుణాకర్ సూచించారు.

## విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన సదస్సు.

**ఇబ్రహీంపట్నం జూన్ 25 /తెలంగాణ వాణి విలేఖరి/**



జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థులకి డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ కుమార్ మాట్లాడుతూ కొంతమంది యువకులు ఆసక్తి స్నేహితులు ఒత్తిడి లేదా తప్పుడు ప్రచారాలకు ఆకర్షితులై డ్రగ్స్ వైపు మొగ్గు చూపుతారని అలాంటి నిర్ణయాలు జీవితాన్ని చీకటిలోకి నెట్టివేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, కళాశాల సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# సమస్యల వలయాల్లో సరస్వతి నిలయాలు-1

- **భువనగిరి కేజీ బీవీలో నీటి కొరత**
- **అధికారులు వచ్చి వెళుతున్నా - సమస్యలు యథాతథం**

**భువనగిరి జూన్: 25(తెలంగాణ వాణి విలేక)**
భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సమస్యలతో సతమతమౌతుంది. సుమారు 300 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్న విద్యాలయంలో నీటి సరఫరాకు సంబంధించిన శాశ్వత పరిష్కారం అధికారులు చేయలేక పోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు బాలల హక్కుల సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో నీటి కొరత తీవ్రంగా ఉందని గుర్తించిన అప్పటి భువనగిరి ఆర్డీవో భూపాల్ రెడ్డి ప్రభుత్వ నిధులతో బోరు వేయించారు. ఆ బోరు వర్షా కాలంలో సరిపడా నీటిని అందిస్తున్నా ఎండా కాలంలో



మాత్రం నీటి తిప్పలు తప్పడం లేదు. పాఠశాల ప్రారంభమై వారం రోజుల గడుస్తున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడం వర్షాలు పడకపోవడంతో నీటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు స్నానాలు చేయడానికి తగినన్ని నీళ్లు లేకపోవడంతో స్నానాలు చేయడం లేదు. ఒకవైపు విపరీతమైన ఎండలు మరొకవైపు నీటి కొరతతో కొందరు విద్యార్థులు సిక్ లీవ్ పెట్టుకుని ఇళ్ళకు వెళుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇందిరమ్మ కాలనీ వాసులకు కేజీ బీవీ పాఠశాల కు వేరువేరుగా ట్యాంకర్ల కేటాయించినా అవి సక్రమంగా నీటి సరఫరా చేయడం లేదని ఆరోపణలు వినబడుతున్నాయి. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అనేక మంది అధికారులు పాఠశాల పర్యవేక్షణ పేరుతో సందర్శించినా నీటి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాలికలకు నీటి వసతి కల్పించాలని బాలికలు బాలల హక్కుల సంఘం నాయకులు కోరుతున్నారు.

## అమరుల స్థూపం భూముల కబ్జాపై హుస్నాబాద్ జేఏసీ ఆగ్రహం

**హుస్నాబాద్ జూన్ 25 (తెలంగాణ వాణి ఆర్ సి)**
హుస్నాబాద్ పట్టణంలోని అమరుల స్థూపం పరిసర భూముల కబ్జాపై హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సర్వే నంబర్ 1189లోని చారిత్రాత్మక స్థూపం భూమి అధికార అండతో అన్యాక్రాంతం అవుతోందని ఆరోపించారు.పీపుల్స్ వార్ ఉద్యమ అమరుల స్మారకార్థం నిర్మించిన 88 అడుగుల స్థూపం, దాని పరిసర భూములు ప్రజల వారసత్వ సంపదగా నిలిచాయని పేర్కొంటూ, స్థూపం పునర్నిర్మాణం, స్మృతి వనం ఏర్పాటు చేస్తామని గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్తూపం ఆవరణలో కొనసాగుతున్న అనుమతి లేని నిర్మాణాలను వెంటనే తొలగించాలని, సర్వే నంబర్ 1189/బికి సంబంధించిన భూ రికార్డులను బహిరంగ పరచాలని కోరారు.భూదాన్ భూముల హక్కులు, పట్టాల మార్పులు, నిర్మాణ అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసిన నాయకులు, చరిత్రను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధమని ప్రకటిస్తూ, గద్దర్ స్మారక ట్రస్ట్ ఏర్పాటు చేసి స్మృతి వనం, ఆడిటోరియం



నిర్మించాలని సూచించారు. "హుస్నాబాద్ అమరుల స్థూపం స్థల సాధన కమిటీ" ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో-కన్వీనర్లు మేకల వీరన్న యాదవ్, డ్యాగల సారయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెన్న రాజు, పట్టణ అధ్యక్షుడు వడ్డేపల్లి వెంకటరమణ, కౌన్సిలర్లు గాదపాక రవీందర్, కేశవేణి రమేష్, అఖిలపక్ష నాయకులు గడిపె మల్లేష్, ఐలేని మల్లికార్జున్ రెడ్డి, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బత్తుల చంద్రమౌళి, బత్తుల రవీందర్, కోయ్యడ కొమురయ్య, జేఏసీ నాయకులు మోహన్ రెడ్డి, వడ్డేపల్లి చంద్రమౌళి, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు



## బండల గూడ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**- ఎమ్మెల్యే జీఎంఆర్ సహకారంతో చర్యలు : యాదగిరి యాదవ్**

**పటాన్ చెరు, జూన్ 25 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండలగూడ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో కృషి చేస్తానని రామచంద్రాపురం మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు నాలకంటి యాదగిరి యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు గురువారం హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రేమ్ కుమార్‌తో కలిసి బండలగూడలోని పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను యాదగిరి యాదవ్ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, ప్రజలకు ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులను కోరారు.అనంతరం యాదగిరి యాదవ్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, పదవులు కంటే ప్రజల విశ్వాసమే తనకు ముఖ్యమని పేర్కొన్నారు.తాను ఎంపీపీగా ఉన్న సమయంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహకారంతో ఈ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా ఎమ్మెల్యే సూచనలు, ఆదేశాలను పాటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. బండలగూడ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని యాదగిరి యాదవ్ భరోసా ఇచ్చారు.

# ఎస్ఐఆర్-2026పై విస్తృత ప్రచారం

- **ఎస్ఐఆర్-2026పై విస్తృత ప్రచారం**
- **పటాన్‌చెరులో 2కే రన్**
- **ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పరిశీలించిన ఈఆర్‌ఓ**

**పటాన్ చెరు, జూన్ 25 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)ను విజయవంతం చేసేందుకు పటాన్ చెరులో గురువారం విస్తృత అవగాహన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు ఈఆర్‌ఓ వెంకటేశ్వరరావు శ్రీరామ్‌నగర్ కాలనీలో ఫీల్డ్ విజిట్ నిర్వహించి ఇంటింటికి జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఏఈఆర్‌ఓ, డీఎల్ఎంటీ, డీటీలు, ఈపిక్ సిబ్బంది, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఈఆర్‌ఓ వెంకటేశ్వరరావు, బీఎల్‌ఓ యాప్‌లో ఫారాల పంపిణీ నమోదును తనిఖీ చేశారు. ఓటర్లకు అందజేస్తున్న ఫారాల వివరాలను పరిశీలించి, పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎస్ఐఆర్-2026 కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పటాన్ చెరు పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌లో ఎన్నికల




సిబ్బంది, బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొని ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటరు జాబితాలోని వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ఓటరు జాబితాను మరింత పకడ్బందీగా రూపొందించడమే లక్ష్యమని తెలిపారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్

**జగిత్యాల: జూన్ 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు.ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి,



వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ హకీమ్,సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

## 30 గిన్నిస్ రికార్డులతో గీతం పూర్వ విద్యార్థిని ఘనత

**దేశంలోనే అత్యధిక గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించిన శివాలి శ్రీవాస్తవ**

**పటాన్ చెరు, జూన్ 25 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థిని శివాలి శ్రీవాస్తవ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. మొత్తం 30 గిన్నిస్ ప్రపంచ రికార్డులను సాధించి దేశంలోనే అత్యధిక గిన్నిస్ ప్రపంచ రికార్డులు కలిగిన వ్యక్తిగా నిలిచినట్లు విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. 2016-2020 బ్యాచ్ కు చెందిన శివాలి శ్రీవాస్తవ ఇటీవల తన తల్లిదండ్రులు కవితా శ్రీవాస్తవ, అనిల్ శ్రీవాస్తవల తో కలిసి మరో ఏడు కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డులను అధికారికంగా అందుకున్నారు. దీంతో వారి కుటుంబం సాధించిన మొత్తం గిన్నిస్ ప్రపంచ రికార్డుల సంఖ్య 30కు చేరుకుంది. ఒరిగామి, పేపర్ ఆర్ట్ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబర్చిన శివాలి, సృజనాత్మకత, అంకితభావం, కచ్చితత్వం, పట్టుదలతో ప్రప ంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆమె తన



తల్లిదండ్రులతో కలిసి లక్షలాది కాగితపు కళాఖండాలను రూపొందించి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. శ్రీవాస్తవ కుటుంబం సాధించిన ఈ విజయాలు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా సహనం, కఠోర శ్రమ, కళాత్మక నైపుణ్యం, కుటుంబ సహకారానికి ప్రతీకగా నిలిచాయని విశ్వవిద్యాలయం పేర్కొంది. ఈ చారిత్రాత్మక ఘనత సాధించిన శివాలి శ్రీవాస్తవకు గీతం యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. కళ, ఆవిష్కరణ, సృజనాత్మకతల సమ్మేళనంగా ఆమె సాధించిన విజయాలు దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువస్తున్నాయని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మెదక్ జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పార్ట్ టైం ఉపాధ్యాయుల నియామకం

మెదక్ జిల్లా కలెక్టర్



**మెదక్ జిల్లా 25 జూన్: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మెదక్ జిల్లాలో పార్ట్ టైం ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల నోటిఫికేషన్కు సంబంధించి కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల పరిధిలో ఉన్న మెదక్, తూప్రాన్, రామాయంపేట, కుల్చారం పాఠశాలలు, జూనియర్ కళాశాలలో, ఎ+టూఔ=ణజ (ఔ) మెదక్ డిగ్రీ కళాశాలలో మొత్తం 23 ఖాళీ పోస్టు ఉన్నట్లు పేర్కొన్నారు వీటిలో జూనియర్ లెక్చరర్లు(తెలుగు ,ఇంగ్లీష్ బోటనీ), పీజీటీలు తెలుగు కాకుండ మిగత అన్ని సబ్జెక్టులు) టీజీటీలు(తెలుగు, హిందీ, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్) పిజికల్ డైరెక్టర్, పిఈటి, లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులు నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉండాలనీ,గురుకుల విద్యాసంస్థల నిబంధనల మేరకు మహిళా విద్యాసంస్థలలో మహిళలకే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది పని వివరించారు ఖాళీగా ఉన్న వివిధ బోధనా పోస్టులను 2026-27 సంవత్సరానికి పార్ట్ టైం ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 26-06-2026 నుండి 04-07-2026 వరకు తమ ఒరిజినల్ , జిరాక్స్ పత్రాలతో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తుల పరిశీలనానంతరం 06-07-2026 ఉదయం 10:00 గంటలకు ఎ+టూఔ=ా/జీజ(+) మెదక్ లో సబ్జెక్టు నిపుణుల కమిటీ ద్వారా డెమో , ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి ఇతర వివరాల కోసం మెదక్ జిల్లా సమన్వయకర్త అయిన అనురాధ గారిని సంప్రదించగలరు 9059526124

## హలో బీసీ -- చలో భువనగిరి పోస్టర్ ఆవిష్కరణ.




**హుస్నాబాద్ జూన్ 25 (తెలంగాణ వాణి ఆర్ సి)**
వచ్చే నెల జూలై 5 న నిర్వహించనున్న హలో బీసీ చలో భువనగిరికార్యక్రమాని కి సంబంధించిన గోడ పోస్టర్‌ను హుస్నాబాద్ లో నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, లక్ష్మీ ఫోటో స్టూడియో యాదగిరి మరియు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాల హక్కులు, సమస్యలు, రిజర్వేషన్ల అంశాలపై అవగాహన కల్పించేందుకు హలో బీసీ చలో భువనగిరి కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎమ్మెల్సీ, బీసీ నాయకుడు తీన్మార్ మల్లన్న అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు.దేశంలో సుమారు 140 కోట్ల జనాభాలో బీసీలు 65 శాతానికి పైగా ఉన్నప్పటికీ, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో కేంద్ర ప్రభుత్వాలువిఫలమయ్యాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రిజర్వేషన్లు అమలులో ఉండగా, బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల కోసం ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి రూ.10 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, క్రిమిలేయర్ పరిమితిని రూ.15 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.బీసీల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిర్వహించనున్న బీసీ సింహగర్జన బహిరంగ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి బీసీ ప్రజలు, యువత, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు

## కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల: జూన్ 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మేడిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారికి పాఠాలు బోధించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకుంటూ విద్యా ప్రమాణాల పై ఆరా తీశారు.అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదీ లేదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతను విద్యార్థులతో కలిసి సహబంతి భోజనం చేశారు. పరిశుభ్రత, పాఠశాల నిర్వహణ పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థినుల కోసం అదనపు డార్మెటరీ అవసరాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే డార్మెటరీ నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, తహసీల్దార్, పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత**

**గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి**



**జగిత్యాల: జూన్ 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు.గురువారం మల్లాపూర్ మండలం ముత్యం పేట గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు.ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా మల్లాపూర్ మండలంలోని ఇందిరా నగర్ గ్రామంలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు ( గ్రామ సభ) నిర్వహించారు. భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా సర్వే, బౌండరీ 1923 గురించి, సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఏ. డి కిషన్ ప్రసాద్, తహసీల్దార్, సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్ ప్రారంభ ప్రారంభోత్సవం పాల్గొన్న జిల్లెల

**వనపర్తి : జూన్ 25, (తెలంగాణ వాణి ప్రతినిధి ):**
పెబ్బేరు మండలానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవి నాయక్ ఆహ్వాన మేరకు వనపర్తి మండలం నాచహళ్ళి గ్రామంలోరైస్ మిల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఏఐపిసి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పాల్గొని ారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# బీజేపీ హయాంలోనే అన్ని రాష్ట్రాలకు సమన్యాయం: రామచందర్ రావు

**హైదరాబాద్/శేరిలింగంపల్లి, జూన్ 25 (తెలంగాణ వాణి):**
బీజేపీ హయాంలోనే అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మదీనాగూడలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రగుడ్ల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ సామాజిక సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బీజేపీ ప్రభుత్వం ముందంజలో ఉందని ఆయన అన్నారు. వీధి వ్యాపారులకు ముద్ర రుణాలు, ఇతర ఆర్థిక సహాయ పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు చేయలేని అనేక అభివృద్ధి కార్యక్రమాలను బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దేశంలో విమానాశ్రయాల సంఖ్యను గణనీయంగా పెంచిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. వరంగల్ టెక్స్టైల్ పార్క్, జహీరాబాద్‌లో నిమ్జ్ వంటి ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు.



కరోనా సమయంలో దేశ ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించామని గుర్తుచేశారు. ఓబీసీలకు న్యాయం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించడంతో పాటు నీట్ పరీక్షల్లో 27 శాతం రిజర్వేషన్ అమలు చేశామని తెలిపారు. కులగణన ప్రక్రియను కూడా మళ్లీ ప్రారంభించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలు కావడం లేదని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందకపోవడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రగుడ్ల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు రుణాల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు.

**రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.**

ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్, అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కార్యదర్శి సుమన్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు నాగులు గౌడ్, ములుగు జిల్లా ఇంచార్జి నరేష్ కొరటాల, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై 29న పోరుబాట

- ఎరువుల ధరలు తగ్గించాలి
- మొబైల్ యాప్ విధానాన్ని రద్దు చేయాలి

**టేకులపల్లి, జూన్ 25 (తెలంగాణ వాణి)**
రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కల్తీ వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన టేకులపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు చేపట్టబోయే భారీ ధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం వారు టేకులపల్లిలో ఆవిష్కరించారు.ఈ ధర్నాకు రైతులు,వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...నూతన సాగు సీజన్ మొదలైనా,ప్రభుత్వం గతంలో కొనుగోలు చేసిన మొక్కజొన్న



పంటకు సంబంధించిన నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయక పోవడం దారుణమన్నారు.చేతిలో పైసలు లేక,పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే మొక్కజొన్న బకాయిలన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా,మార్కెట్లో పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని ,ప్రస్తుతం ప్రవేశపెట్టిన'మొబైల్ యాప్' ద్వారా ఎరువుల కొనుగోలు పద్ధతిని పూర్తిగా ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేని గ్రామీణ ప్రాంత రైతులు ఈ యాప్ విధానం వల్ల యూరియా,ఇతర ఎరువులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.రైతులను వేధిస్తున్న మొబైల్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయకుంటే,అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని,ప్రభుత్వ కార్యాలయాల ముట్టడికి వెనుకాడబోమని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గుగులోత్ రామచంద్,భూక్యా హర్ష్య,సంఘం ప్రముఖ నాయకులు భూక్య నర్సింగ్,అంగోత్ బాలు,బానోత్ వెంకట్రాం,ధరావత్ బిక్యా,ధరావత్ వెంకన్న, భూక్య రామకోటి, అనంతోజు చంద్రచారి, లింబ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలి



**టేకులపల్లి, జూన్ 25 (తెలంగాణ వాణి)**
ఈనెల 28వ తేదీ ఆదివారం రోజున మండల వ్యాప్తంగా నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ పిలుపునిచ్చారు.గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపర్డెంట్ వేపూరి రవీందర్ నాథ్ అధ్యక్షతన పల్స్ పోలియో మండల్ లెవెల్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం అత్యంత సమీక్షాత్మకంగా జరిగింది.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ మాట్లాడుతూ...0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడానికి,వారిలో రోగ నిరోధక శక్తిని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు.సాధారణ వ్యాక్సినేషన్ షెడ్యూల్‌లో భాగంగా రొటీన్ గా వేసే పోలియో చుక్కలతో సంబంధం లేకుండా,ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ అదనంగా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.మండలంలోని లబ్ధిదారులైన పిల్లలందరికీ ఈ చుక్కల మందు అందేలా అధికారులు,ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సేవా సంస్థలు మరియు ప్రజలు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.మండలంలో పల్స్ పోలియో నిర్వహణ కొరకు చేసిన ఏర్పాట్లను ఆయన వివరిస్తూ..టేకులపల్లి మండల వ్యాప్తంగా మొత్తం 4,562 మంది ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు.సుదూర ప్రాంతాల పిల్లలకు కూడా చుక్కల మందు అందేలా మొత్తం 5 ప్రత్యేక రూట్లను ఏర్పాటు చేశామని,మండల పరిధిలో 50 పోలియో బూత్‌లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు అంగన్‌వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వైద్యాధికారి వెల్లడించారు.ఈ సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి మట్టా సరోజిని,ఏపీఓ శ్రీనివాస్ రావు,పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ,ఆరోగ్య విస్తరణాధికారి పున్నమయ్య, గుజ్జా విజయ,కౌసల్య సింగ్,ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి,నిర్మల,వాసవి తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు ఆధ్యాత్మికత భావానికి, ప్రజల మధ్య సత్సంబంధాలకు ఐక్యతకు నిదర్శనము

**-మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**

**చౌటుప్పల్, జూన్ 25 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం లో ఘనంగా నిర్వహించిన బొడ్రాయి మహోత్సవ కార్యక్రమం మరియు శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో గురువారం మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. అనంతరం స్థానిక కౌన్సిలర్‌తో పాటు గ్రామంలోని ప్రముఖులు ఆయనకు శాలువా కప్పి ఘన స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలనీ ,ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు



కలగాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వల్లందాసు సతీష్ మరియు రమణగోని రఘు నివాసాలకు వెళ్లి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత రక్త పరీక్ష కేంద్రం ప్రారంభించిన ' ప్రభుత్వ విప్ '

**నకిరేకల్ : జూన్ 25 (తెలంగాణ వాణి)**
నకిరేకల్ పరిధిలోని నార్కెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా సంఘ సభ్యుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ఈ ఉచిత రక్త పరీక్ష ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మహిళ సంఘ సభ్యులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని సూచించారు. ముఖ్యమంత్రి విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



**నకిరేకల్ : జూన్ 25(తెలంగాణ వాణి)**
నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు పదవ తరగతి 1996 - 1997 బ్యాచ్ విద్యార్థులు పాలెం కు చెందిన గుండెగోని కృష్ణ అకాలంగా మరణించడం తో 23,500 రూపాయలు కుటుంబ సభ్యులకు తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మరియు కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని భగవంతుని ప్రార్థించారు. ప్రభుత్వము మరణించిన కృష్ణ కుటుంబానికి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో (టి పి సి సి నల్గొండ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్. వికలాంగుల విభాగం) మరియు చిన్ననాటి ఆత్మీయ స్నేహితులు అందరూ కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.



## ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

**టేకులపల్లి, జూన్ 25 (తెలంగాణ వాణి)**
ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా,టేకులపల్లి మండల పరిధిలో ఓటరు జాబితా సవరణ కొరకు ఇంటింటి సర్వే కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించబడింది.మండల పరిధిలోని గంగారం,లచ్చగూడెం,కిష్టారం,మరియు చింతోని చెలక గ్రామపంచాయతీలలో ఈ సర్వే కార్యక్రమాన్ని అధికారులు,ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా చేపట్టారు.ఈ సందర్భంగా కోరం సురేందర్,బీఎల్ఓ పాయం సమ్మక్క, మరియు స్థానిక సర్పంచులు ప్రజలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు సర్వే ప్రక్రియను పర్యవేక్షించి,కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కోరం సురేందర్ మాట్లాడుతూ"ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి అర్హుడైన పౌరుడూ ఓటరుగా నమోదు కావాలి.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ సవరణ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని,ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి లేదా వివరాలను సరిచూసుకోవాలి"అని పిలుపునిచ్చారు.

## టేకులపల్లి మండలంలో విద్యుత్ విషాదం

**ఒకే చేనులో ఇద్దరి మృతితో అలుముకున్న విషాద ఛాయలు**

**టేకులపల్లి, జూన్ 25 (తెలంగాణ వాణి)**





టేకులపల్లి మండలంలోని బోడు గ్రామ పంచాయతీ పరిధిలో 24 గంటల వ్యవధిలో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘటనలు స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని, విషాదాన్ని నింపాయి. బుధవారం విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన మరవక ముందే గురువారం అదే చేనులో రైతు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికులను కలచివేసింది. బోడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పోదెం స్వరూప అత్త అయిన పొదెం చుక్కమ్మ (55) బుధవారం మొక్కంపాడు గ్రామ సమీపంలోని ఓ పత్తి చేనులో కూలి పనుల నిమిత్తం వెళ్లారు. చేను చుట్టూ ఉన్న ఫెన్సింగ్ దాటే క్రమంలో ప్రమాదవశాత్తు దానికి అమర్చిన విద్యుత్ తీగలు తగలడంతో ఆమె తీవ్ర విద్యుత్ ఘాతానికి గురయ్యారు.గమనించిన తోటి కూలీలు ఆమెను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చుక్కమ్మ మృతి చెందారు.ఈ ప్రమాదం జరిగిన చేను బోడు గ్రామానికి చెందిన మాడె పాపయ్య అనే రైతుదిగా గుర్తించారు.తన చేను ఫెన్సింగ్ వైర్ తగిలి మహిళ మరణించడంతో..ఎక్కడ తనపై పోలీస్ కేసు నమోదవుతుందోననే భయంతో పాపయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.ఈ క్రమంలో గురువారం ఉదయం ఆయన అదే పత్తి చేనులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.ఒకే చేనులో ఒకరోజు వ్యవధిలోనే ఇద్దరు వ్యక్తులు మరణించడంతో బోడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.పాపయ్య మృతికి గల పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## ఎస్సై కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు



రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె. భాస్కర్

**వనపర్తి : జూన్ 25, (తెలంగాణ వాణి ప్రతినిధి)**

పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి సి పి పి. మధుకర్ స్వామి, సారధ్యంలో సబ్ ఇన్స్పెక్టర్, కానిస్టేబుల ఉద్యోగా ల కొరకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ,శ్రీధర్ సీసీ ఈ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కొరకు, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్బుక్ పేజ్ లేదా పర క్రియేటివ్ ఫౌండేషన్ యూట్యూబ్ ఛానల్ లేదా పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్సైట్ లోని క్యూఆర్ కోడ్ ద్వారా జూన్ 24 నుండి దరఖాస్తు చేసుకోగలరు. దరఖాస్తు చేయడానికి చివరి తేదీ జూన్ 26 రాత్రి 9 గంటల వరకు అర్హత పరీక్ష జూన్ 28- 2026 రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో మొత్తం 47 కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ కు చెందిన అభ్యర్థులకు వనపర్తి కేంద్రంగా ఉంటుందని, మెరిట్ ఆధారంగా సెలెక్ట్ అయిన అభ్యర్థులకు సుమారు నాలుగు నెలలు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. సందేహాలకు 9542433427 ఈ నెంబర్ను సంప్రదించాలని తెలిపారు.

## జిల్లా బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం



**వనపర్తి : జూన్ 25, (తెలంగాణ వాణి ప్రతినిధి)**

: వనపర్తి జిల్లా కేంద్రం నాగవరంలో నిర్మించిన భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని ఆధునిక హంగులతో సిద్ధం చేయగా, ఈ నెల 28వ తేదీన ఘనంగా ప్రారంభించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ జాతీయ నాయకుడు నితిన్ నబిన్ వర్చువల్ విధానంలో ప్రారంభించనుండగా, ముఖ్య అతిథిగా ఏవిఎన్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మోదీ అభిమానులు, జాతీయవాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ పిలుపునిచ్చారు. నూతన కార్యాలయం పార్టీ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారం, సేవా కార్యక్రమాల నిర్వహణ మరియు పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, మాజీ రాష్ట్ర నాయకులు ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, అధికార ప్రతినిధి నక్క మహేష్,కొండోజ్ గోపీనాథ్, ఐటీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## గరిడేపల్లి బస్టాండ్ నిరుపయోగం -- ఎండలోనే మహిళలు, ప్రయాణికుల నిరీక్షణ



**గరిడేపల్లి జూన్ 25 (తెలంగాణ వాణి జిల్లా బ్యూరో )**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం లోని గరిడేపల్లి గ్రామం మధ్యలో బస్టాండ్ నిర్మాణం ఉన్నప్పటికీ, అది ఇప్పటికీ పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ అందుబాటులో ఉన్నప్పటికీ రోడ్డుపైనే ఎండలో, వర్షంలో బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏళ్ల తరబడి ఈ సమస్య కొనసాగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే బస్టాండును వినియోగంలోకి తీసుకువచ్చి, అవసరమైన సదుపాయాలు కల్పించాలని గరిడేపల్లి ప్రజలు, మహిళలు మరియు ప్రయాణికులు, ఆర్టీసీ, అధికారులను కోరుతున్నారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ప్రారంభించిన ముష్టిపల్లి గ్రామ బిఎల్వోలు



**నాంపల్లి: (నాంపల్లి తెలంగాణ వాణి ప్రతినిధి)**

నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామంలో ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు నల్లగంటి సరస్వతి,ఆలంపల్లి పద్మ లు పాల్గొని ఓటర్లకు ఎస్ఐఆర్ మీద అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమం 2002 లో జరిగి మళ్ళీ కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం తీసుకొచ్చింది,ఈ ప్రక్రియలో ఫారం ఆరు కొత్త ఓటరుగా,ఫారం ఏడు ఓటును తొలగించడం కోసం,ఫారం ఎనిమిది ఓట్లలో మార్పుల కోసం ఇవ్వడం జరుగుతుంది, ఎన్యూమరేషన్ ఫారం తీసుకుని ఓటర్ వివరాలు పూర్తిగా నింపాలని ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు. ఈ పక్రియ జూలై ఇరవై నాలుగు వరకు ఉంటుందని బి ఎల్ ఓ నల్లగంటి సరస్వతి,ఆలంపల్లి పద్మ తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల బిఎల్ఎలు మరియు ఓటర్లు మరియు యువత పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం
- ఘనంగా 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్'నాల్గవ రోజు కార్యక్రమాలు.
- కలెక్టరేట్ నుండి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ.
- కళాశాల విద్యార్థుల వీధి నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో చైతన్యం.
- మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ



**కరీంనగర్:జూన్ 25 (తెలంగాణ వాణి ప్రతినిది)**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నాల్గవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ,మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

?కలెక్టరేట్ ప్రారంభమైన ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ గీతాభవన్ చౌరస్తా మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు,నర్సింగ్,మెడికల్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం (నాటిక),అవగాహన గీతాలు ప్రజలను,తోటి విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి.

అంధకారంలోకి భవిష్యత్తు -- స్కిట్ ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శన: ర్యాలీ అనంతరం కమిషనరేట్ కేంద్రంలోని 'అస్త్ర కన్వెన్షన్ హాలు'నందు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం అధ్యక్షతన విద్యార్థులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక షార్ట్ ఫిల్మ్ను విద్యార్థులకు ప్రదర్శించారు. అనంతరం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత జీవితాలు ఎలా అంధకారంలోకి వెళ్తాయి, కుటుంబాలు ఎలా నాశనమవుతాయనే విషయాన్ని కళ్ళకు కట్టింది. నర్సింగ్ విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శన ద్వారా డ్రగ్స్ రహిత సమాజంపై చక్కని సందేశాన్ని ఇచ్చారు.

ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలపై దృష్టి పెట్టండి: సిపి గౌస్ ఆలం సదస్సులో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద మహమ్మారి మాదకద్రవ్యాల దుర్వినియోగం (డ్రగ్ అబ్యూస్) అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకూడదని హితవు పలికారు. చదువుల వల్ల కలిగే ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా,స్పోర్ట్స్, శారీరక వ్యాయామం (ఫిజికల్ యాక్టివిటీ) పై దృష్టి సారించాలని సూచించారు.

కరీంనగర్ జిల్లాను డ్రగ్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల విద్యాసంస్థల పరిసరాల్లోని (100 మీటర్ల లోపు) 99 పాన్ షాపులపై దాడులు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 52 కేసులు నమోదు చేసినట్లు గుర్తుచేశారు. కమీషనరేట్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో 'కాన్షియస్ క్లబ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. "సే నో టు డ్రగ్స్ - సే ఎస్ టు లైఫ్ " అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ లేదా గంజాయి సేవించడం, విక్రయించడం 'ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ - సెక్షన్ 27' ప్రకారం చట్టరీత్యా తీవ్రమైన నేరమని,దీనివల్ల భవిష్యత్తు సర్వనాశనమవు తుందని హెచ్చరించారు.

స్వీయ నియంత్రణే శ్రీరామరక్ష:సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణాను, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. అయితే,అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, యువతలో 'స్వీయ నియంత్రణ'ఉన్నప్పుడే డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి,తమ జీవిత లక్ష్యాలను చేరుకోగలరని ఆకాంక్షించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం -- ప్రతిజ్ఞ,సంతకాల సేకరణ:ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ వీక్ లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు సిపి గౌస్ ఆలం చేతుల మీదుగా బహుమతులు,ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అధికారులు, విద్యార్థులందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'సంతకాల సేకరణ బోర్డు'పై సీపీతో పాటు ఇతర అతిథులు, అధికారులు సంతకాలు చేసి, కరీంనగర్ను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతామని సంకల్పించారు.

ఈ సదస్సులో అడిషనల్ డీసీపీ వెంకటరమణ,ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి సరస్వతి,డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్,విజయకుమార్, యాదగిరిస్వామి,ఆంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ ఇతర పోలీస్,ఎక్సైజ్ అధికారులు మరియు వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# కార్మికుల ఆవేదనను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన గుర్తింపు సంఘం

- ఆర్ఎల్సీ చర్చల అనంతరం సింగరేణి భవన్లో కీలక భేటీ
- పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన యాజమాన్యం

**కొత్తగూడెం సింగరేణి, జూన్ (తెలంగాణ వాణి)**

ఆర్ఎల్సీ సమక్షంలో సమ్మె నోటీసుపై జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం, ఎఐటీయూసీ గౌరవ అధ్యక్షులు, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో గుర్తింపు సంఘం నాయకులు గురువారం సింగరేణి భవన్లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రూలను కలిశారు. అనంతరం కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, అసంతృప్తికి కారణమైన అంశాలు, సమ్మె నోటీసు వెనుక ఉన్న వాస్తవ పరిస్థితులను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణి కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పలు



సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోకపోవడం వల్ల కార్మికుల్లో తీవ్ర ఆవేదన, అసంతృప్తి నెలకొన్నదని పేర్కొన్నారు. పదోన్నతులు, బదిలీలు, వారసత్వ ఉద్యోగాలు, కేడర్ సమస్యలు, సంక్షేమ అంశాలు, భద్రతా ప్రమాణాలు వంటి పలు సమస్యల పరిష్కారంలో జాప్యం జరగడం వల్లే కార్మికులు సమ్మె నోటీసు దిశగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. అదేవిధంగా, సంస్థ భవిష్యత్తు పరిరక్షణ కోసం కొత్త బొగ్గు గనులు, నూతన ప్రాజెక్టులు, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపై దృష్టి సారించి సింగరేణి మనుగడను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని యాజమాన్యానికి సూచించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి రెండూ పరస్పర అనుబంధమైన అంశాలని, ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. గుర్తింపు సంఘం ప్రతిపాదనలను సానుకూలంగా స్వీకరించిన యాజమాన్యం, కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపింది. త్వరలోనే స్ట్రక్చర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి పెండింగ్లో ఉన్న అంశాలపై సమగ్ర చర్చ జరిపి, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఈ సమావేశంలో ఎఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కె. సారయ్యతో పాటు డైరెక్టర్లు మరియు గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పే అప్గ్రేడేషన్, పీఆర్పీ బకాయిలు చెల్లించాలి

**కొత్తగూడెంలో సింగరేణి అధికారుల నిరసన**

**కొత్తగూడెం సింగరేణి, జూన్ 25 (తెలంగాణ వాణి)**

పే అప్గ్రేడేషన్, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ) బకాయిల చెల్లింపు తదితర డిమాండ్లతో సింగరేణి ఎగ్జిక్యూటివ్ అధికారులు గురురం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ముందు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బొగ్గు గనుల అధికారుల సంఘం ఆధ్వర్యంలో అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. అధికారుల శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని, అధికారుల గౌరవం కాపాడాలని, సింగరేణి భవిష్యత్తును బలోపేతం చేయాలని నినాదాలు చేశారు. సింగరేణిలో కోల్ ఇండియా తరహాలోనే పే అప్గ్రేడేషన్ చేయాలని, 2017 వేతన సవరణ నష్టాన్ని సరిచేస్తూ పే అప్గ్రేడేషన్ తోపాటు వేతనాల్లో భాగమైన 2022, 2023 పీఆర్పీ






పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు, బదిలీలు, పోస్టింగ్ల పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. సింగరేణి భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న తమ పట్ల ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించిన అధికారులు, సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్లను కేటాయించాలని కూడా డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**హసన్ పర్తి జూన్ 25। తెలంగాణ వాణి ప్రతినిధి।**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాలివెల్పుల గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక పోలీసులు, పాఠశాల సిబ్బంది హాజరై విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలగురించివివరించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు, వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. డ్రగ్స్కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని డ్రగ్స్కు వ్యతిరేకంగా అవగాహన కల్పించే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్పెషల్ ఇంటెన్సూ రివిజన్ (సర్) ఓటు మ్యాపింగ్ నీ పరిశీలించిన స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్..



**కుత్బుల్లాపూర్ ...జూన్ 25...( తెలంగాణ వాణి)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ పరిధిలోని కైసర్ నగర్ లో కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నా×= ప్రత్యేక ఓటరు సవరణ జాబితా కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ ఉప కమిషనర్ వెంకటరమణ తో కలిసి ఓటు మ్యాపింగ్ నీ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ పరిశీలించారు...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎల్ఓ లు ప్రతి ఇంటింటికి తిరుగుతూ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని, అదేవిధంగా నకిలీ ఓట్లను తొలగించాలని కృషి చేయాలని, అదేవిధంగా ప్రతి ఒక్కరూ బిఎల్వోల నుండి ఎమ్యునరేషన్ ఫామ్ను తీసుకొని తమ వివరాలను నమోదు చేసి ఓటు హక్కును పొందాలని అదేవిధంగా, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటు హక్కును ఈ కార్యక్రమంలో పొందవచ్చు అని తెలియజేశారు, స్థానిక ఓటర్లు బిఎల్ఓ లకు సహకరిస్తూ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు... ఈ కార్యక్రమంలో గాజులరామారం ఉప కమిషనర్ వెంకటరమణ , బూత్ లెవెల్ ఆఫీసర్లు , కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ పునః ప్రతిష్ఠాపన



**కుత్బుల్లాపూర్ ....జూన్ 25 ...(తెలంగాణ వాణి..).**
ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా (శుక్రవారం) మధ్యాహ్నం 12:00 గంటలకు పునః ప్రతిష్ఠాపన (ఆవిష్కరణ) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడుతుంది. భాగ్యనగర్ శివాజీ సేవ సంస్థ అధ్యక్షులు. నందనం దివాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా: ఈటల రాజేందర్ ,
మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు (ఎంపీ)
- కేపీ వివేకానంద కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే)
- . విజయ్ శేఖర్ గౌడ్ స్థానిక కార్పొరేటర్‌పాల్గొని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా హిందూ బంధువులు, శివాజీ అభిమానులు, యువత, మహిళలు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక వేడుకలను, విగ్రహ పునః ప్రతిష్ఠాపన (ఆవిష్కరణ) కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమం జరిగే స్థలం:ఛత్రపతి శివాజీ చౌక్, రంగారెడ్డి నగర్ బస్ స్టాప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, మేడ్చల్--మల్కాజిగిరి .

## మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం



**కరీంనగర్, జూన్ 25 (తెలంగాణ వాణి)**
అంతర్జాతీయ మాదకద్రవ్యా ల వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ అనుమతితో, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు న్యాయమూర్తి శ్రీమతి కె. రాణి గారి ఆదేశాల మేరకు విద్యార్థులకు ముందస్తు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని మంకమ్మతోట కాకతీయ స్కూల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, ప్యానల్ అడ్వకేట్స్ చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, సకినాల ప్రవీణ్ కుమార్, ఏ. కిరణ్ కుమార్, ఎస్.వి.ఆర్ కృష్ణ, పెరుక రంగయ్య లు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక దుష్పరిణామాల గురించి వారు విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. దేశ భవిష్యత్తు కోసం నేటి విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని వారు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ మరియు విక్రయాలు చట్టరీత్యా అత్యంత తీవ్రమైన శిక్షార్హమైన నేరాలని తెలిపారు. వీటి నివారణలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా తమ అమూల్యమైన సమయాన్ని విద్య, క్రీడలు, పుస్తక పఠనం మరియు సృజనాత్మక కార్యక్రమాలపై కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు.సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాగర్ రావు,పారా లీగల్ వాలంటీర్ రేష్మ, శ్రీలతలు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## శానిటేషన్ మరియు స్వీపింగ్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

### జిల్లా కోఆర్డినేటర్ ఎం.సునీత.



**ఖమ్మం, జూన్ 25 (తెలంగాణ వాణి)**
ఖమ్మం జిల్లాలోని ఖమ్మం డిగ్రీ కళాశాల, టేకులపల్లి, అంబేద్కర్,దానవాయిగూడెం ^హసుమంచి,మధిర,నేలకొండపల్లి, అడవిమల్లేల,ఎర్రుపాలెం ,కల్లూరు,వైరా,తిరుమలాయపాలెం, సత్తుపల్లి, మధిర,పాఠశాల కళాశాలలో స్వీపింగ్ తో పాటు శానిటేషన్ నిర్వహణపై అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎం.సునీత ఓ ప్రకటనలో తెలిపారు.ఈ విద్యాసంవత్సరం నకు సంబంధించిన టెండర్ల దరఖాస్తు ఫారాలు ఈనెల 27నుండి 29వ తేదీ వరకు పని దినములలో టేకులపల్లి టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఎస్ జూనియర్ కళాశాల బాలికల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మొత్తాన్ని ఎస్బిఐ బ్యాంకులో డీడీ రూపంలో చెల్లించాలని సూచించారు 30వ తేదీ ఉదయం 11:00 గంటలకు సీల్డ్ టెండర్లను తెరవనున్నట్లు తెలిపారు.

# ఇరాన్‌కు ఎలాంటి డబ్బు ఇవ్వడం లేదు: ట్రంప్

- ఆస్తుల విడుదల ప్రశ్నే లేదు.. అవసరమైతే ఆహారం అందిస్తాం
- అణు కేంద్రాల తనిఖీలకు అనుమతి లేదన్న ఇరాన్



**న్యూయార్క్/టెహ్రాన్, జూన్ 25** ఇరాన్‌కు అమెరికా ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌కు చెందిన ఆస్తులను విడుదల చేసే ఆలోచన కూడా తమకు లేదని తేల్చిచెప్పారు. అవసరమైతే మానవతా దృక్పథంతో ఆహారం కొనుగోలు చేసి అందించగలమని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై ఎలాంటి టోల్ ఛార్జీలు లేవని, నౌకాయానానికి ఇరాన్ అంగీకరించిందని తెలిపారు. మంగళవారం తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ చేసిన పోస్టు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇరాన్‌కు సంబంధించిన నిధుల విషయంలో అమెరికా వైఖరిని ఆయన స్పష్టంచేశారు. ఆంక్షల సడలింపుల నేపథ్యంలో అన్‌ఫ్రీజ్ అయ్యే లేదా అమెరికా ట్రెజరీ ద్వారా విడుదలయ్యే నిధులు నేరుగా ఇరాన్ ప్రభుత్వానికి వెళ్లవని తెలిపారు. ఆ నిధులన్నీ అమెరికా నియంత్రణలో ఉండే ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లోనే కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇరాన్ ఆ నిధులను కూడా పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా వినియోగించుకోలేదని ట్రంప్ వెల్లడించారు. ఆహారం, ఔషధాలు, వైద్య సామగ్రి వంటి మానవతా అవసరాల కోసం మాత్రమే ఆ మొత్తాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అమెరికా జాతీయ భద్రతకు విఘాతం కలిగించేలా ఎలాంటి నిధులు విడుదలయ్యే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఇరాన్ అణు కేంద్రాల తనిఖీలపై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. టెహ్రాన్‌లో అణు తనిఖీలు చేపట్టనున్నట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) ప్రధాన అధికారి రఫాయెల్ గ్రోసీ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా దెబ్బతిన్న తమ అత్యంత సున్నితమైన అణు కేంద్రాలు, అణు పదార్థాల నిల్వ ప్రాంతాలను పరిశీలించేందుకు ఐఏఈఏకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెం ఘరీబాబాది స్పష్టం చేశారు. దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని ఆయన పేర్కొన్నారు.

### మళ్లీ తెరపైకి అణు వివాదం

ఇరాన్ అణు కార్యక్రమంపై ఇప్పటికే అమెరికా, పాశ్చాత్య దేశాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఇరాన్ వాదిస్తోంది. అయితే తాజా పరిణామాలతో అణు తనిఖీల అంశం మరోసారి అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇరాన్‌కు నిధుల విడుదల, అణు కేంద్రాల తనిఖీలు, హోర్ముజ్ జలసంధి భద్రత వంటి అంశాలపై అమెరికా-ఇరాన్ మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా మారతాయన్న దానిపై అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# ఎస్ఐఆర్ జాబితాలో పేరు లేకుంటే రేషన్ ఇవ్వరా?

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు
ముందు హైకోర్టును ఆశ్రయించండిద
పిటిషనర్‌కు సూచన




**న్యూఢిల్లీ, జూన్ 25** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో పేరు తొలగించబడిన వారికి రేషన్ సరఫరా నిలిపివేస్తున్నారంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే రేషన్ ఇవ్వరా?" అంటూ అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పరిపాలనా నిర్ణయాలకు సంబంధించిన ప్రత్యేక అంశమని అభిప్రాయపడిన సుప్రీంకోర్టు, రాజ్యాంగంలోని ఆర్టికల్-32 కింద నేరుగా తమను ఆశ్రయించడం కంటే ముందుగా సంబంధిత హైకోర్టును సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, పిటిషనర్‌కు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రేషన్ నిరాకరణకు సంబంధించిన వివాదంపై కోల్‌కతా హైకోర్టులో తగిన న్యాయపరమైన పరిహారం కోరవచ్చని పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో పేరు లేకపోవడాన్ని ఆధారంగా చేసుకుని రేషన్ వంటి సంక్షేమ పథకాల లబ్ధిని నిరాకరించడం సరైందేనా అనే అంశంపై న్యాయ, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై కోల్‌కతా హైకోర్టు ముందు విచారణ జరిగే అవకాశం ఉండటంతో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

# ఆ ఆగ్రహంతోనే కాక్రోచ్ ఉద్యమం..

- విద్యార్థుల సమస్యలపై పోరాటం కొనసాగుతుంది
- జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూన్ 25** నీట్ పరీక్ష వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసిన "కాక్రోచ్ ఉద్యమం" వెనుక యువతలో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహమే ప్రధాన కారణమై ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన జైరాం రమేష్, ఈ ఉద్యమం ఆవిర్భావంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. కొందరు దీనిని "డీప్ స్టేట్" ప్రాయోజిత ఉద్యమంగా అభివర్ణిస్తుంటే, మరికొందరు యువతలో పేరుకుపోతున్న నిరాశ, అసంతృప్తికి ఇది ప్రతిబింబమని భావిస్తున్నారని చెప్పారు. "కాక్రోచ్ ఉద్యమం ఎలా ప్రారంభమైందనే విషయంలో భిన్న వాదనలు ఉన్నాయి. కొందరు దీనిని వ్యవస్థీకృతంగా నడిపిస్తున్న ఉద్యమమని అంటున్నారు. మరికొందరు యువతలోని ఆగ్రహం, నిరాశకు ఇది ప్రతిబింబమని చెబుతున్నారు. ఈ రెండు వాదనల్లో ఏది నిజమో నిర్ధారించడం కష్టం. అయితే ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నది వాస్తవం" అని జైరాం రమేష్ పేర్కొన్నారు. కాక్రోచ్ ఉద్యమం ఒక రాజకీయ పార్టీ కాదని, ప్రజాస్వామ్యంలో చివరకు రాజకీయ పార్టీలే సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. యువత అసంతృప్తిని వెలుగులోకి తీసుకురావడంలో ఈ ఉద్యమం ఒక వేదికగా పనిచేసిందని, అయితే ఆ సమస్యలను పరిష్కార దిశగా తీసుకెళ్లాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదేనని అన్నారు.

### విద్యార్థులతో రాహుల్ మమేకం

విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జైరాం రమేష్ తెలిపారు. ఇటీవల రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థులతో సమావేశమైన రాహుల్ గాంధీ, త్వరలో ప్రయాగ్‌రాజ్, పాట్నా, ఢిల్లీ నగరాల్లో కూడా విద్యార్థులతో చర్చలు జరపనున్నారని వెల్లడించారు. రాహుల్ గాంధీ కేవలం నీట్ లేదా ఇతర పరీక్షల వివాదాలకే పరిమితం కావడం లేదని, దేశ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను లేవనెత్తుతున్నారని జైరాం రమేష్ అన్నారు. పరీక్షల నిర్వహణ, విద్యా విధానం, ప్రభుత్వ పెట్టుబడులు, కోచింగ్ వ్యవస్థ ప్రభావం వంటి అంశాలపై సమగ్ర చర్చ అవసరమన్నారు. కోటాలో విద్యా ర్థులతో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, భారత కుటుంబాలు కోచింగ్ కేంద్రాలపై ఖర్చు చేస్తున్న మొత్తంతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం విద్యపై తక్కువగా ఖర్చు చేస్తోందని ఆయన పేర్కొన్నారని జైరాం రమేష్ గుర్తుచేశారు. ఇది దేశ విద్యా వ్యవస్థలో ఉన్న అసమతుల్యతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల పారదర్శకత, విద్యా సంస్కరణలపై కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు.

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఇరాన్ ఆహ్వానం

- జులై 4 నుంచి 9 వరకు కార్యక్రమాలు
- ప్రధాని హాజరుపై ఇంకా స్పష్టత లేదు



**న్యూఢిల్లీ/టెహ్రాన్, జూన్ 25** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అధికారిక ఆహ్వానం పంపినట్లు దౌత్య వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఖమేనీ మరణించిన అనంతరం వాయిదా పడిన అంత్యక్రియలను వచ్చే నెల ఘనంగా నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న టెహ్రాన్‌లో ప్రారంభమై, జులై 9న ఆయన స్వస్థలమైన మషాద్‌లో ఖననంతో ముగియనున్నాయని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. టెహ్రాన్, ఖోమ్, మషాద్ నగరాల్లో పలు దశల్లో సంతాప సభలు, అంతిమ యాత్రలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు వివిధ దేశాల అధినేతలు, ప్రభుత్వ ప్రతినిధులు, దౌత్య బృందాలను ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. భారత్‌తో ఇరాన్‌కు ఉన్న సుదీర్ఘ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాల దృష్ట్యా ప్రధాని మోదీకి ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.

### మోదీ వెళ్తారా..? ప్రతినిధి బృందమా..?

ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా అంత్యక్రియలకు హాజరవుతారా, లేక భారత తరఫున ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపుతారా అన్న అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### భారత్-ఇరాన్ సంబంధాలకు ప్రాధాన్యం

భారత్, ఇరాన్ మధ్య ఇంధన భద్రత, వాణిజ్యం, చాబహార్ నౌకాశ్రయం అభివృద్ధి, ప్రాంతీయ భద్రత వంటి అంశాల్లో కీలక సహకారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఖమేనీ అంత్యక్రియల్లో భారత ప్రాతినిధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రెండు దేశాల దౌత్య సంబంధాల పరంగా కూడా కీలకంగా మారే అవకాశం ఉంది. ఇరాన్ అధికారిక ప్రకటన ప్రకారం జులై 4న టెహ్రాన్‌లో వీడ్కోలు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఖోమ్‌లో ప్రత్యేక సంతాప కార్యక్రమాలు నిర్వహించి, జులై 9న మషాద్‌లోని ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రం సమీపంలో ఖమేనీ భౌతికకాయాన్ని ఖననం చేయనున్నారు.



## 'మాట్లాడినా తప్పే. మౌనంగా ఉన్నా తప్పే'.. ట్రోలింగ్‌పై రజినీకాంత్ అసహనం!

తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి అసహనం వ్యక్తం చేశాడు నటుడు సూపర్ స్టార్ రజనీకాంత్. తాజాగా చెన్నైలో జరిగిన 'ధర్మన్' సినిమా లాంచ్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, బహిరంగంగా మాట్లాడాలంటే ఇప్పుడు భయంగా ఉందని చెప్పారు. తాను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే అవుతోందని రజినీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపైకి మాట్లాడమని పిలిస్తే భయంగా ఉందని, ఎందుకంటే తాను మాట్లాడితే అది తనకు కాకపోయినా మీకు సమస్య అవుతుందని ఆయన అన్నారు. ఒకవేళ మౌనంగా ఉంటే మౌనంగా ఎందుకు ఉన్నాడు అని ఎగతాళి చేస్తారని చెప్పారు. అదే మాట్లాడితే ఇప్పుడు ఎందుకు మాట్లాడాడు, అసలు మాట్లాడకుండా ఉండాల్సింది అని విమర్శిస్తారని తెలిపారు.వీశీజఅవం ఇక చాలా ఏళ్ల తర్వాత తనకు ఒక విషయం అర్థమైందని, మనల్ని ఇష్టపడని వాళ్లకు మనం ఏం చేసినా నచ్చదని, ఇష్టపడేవాళ్లు మనం ఏం చేసినా నచ్చుతుందని అనుకోవడం మూర్ఖత్వమని రజినీ అన్నారు. ప్రతి ఒక్కరూ మనల్ని మెచ్చుకుంటారని ఆశించడం సరికాదని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రజినీకాంత్ 'ధర్మన్' చిత్ర షూటింగ్ గురువారం నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తుండగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించబోతున్నాడు.





## బోనీ కపూర్ ఇంట పెళ్లి సందడి.. జాన్వీ అక్క వెడ్డింగ్ వేడుకలు ప్రారంభం

బాలీవుడ్‌లో మరో స్టార్ వెడ్డింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుటుంబంలో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఆయన పెద్ద కుమార్తె అన్షులా కపూర్ వివాహ వేడుకలు ముంబైలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తన లాంగ్‌టైమ్ బాయ్‌ఫ్రెండ్ రోహన్ థక్కర్‌తో అన్షులా త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టనుండగా, ప్రస్తుతం ప్రీ వెడ్డింగ్ వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య సందడిగా సాగుతున్నాయి.గత ఏడాది న్యూయార్క్‌లో సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న అన్షులా-రోహన్ జంట ఇప్పుడు జూలై 6న పెళ్లి పీటలెక్కబోతోంది. దీంతో కపూర్ కుటుంబంలో ఇప్పటికే పెళ్లి సందడి మొదలైంది. ఈ వివాహ వేడుకల తొలి కార్యక్రమంగా ముంబైలో సంప్రదాయబద్ధంగా 'మాతా కీ చౌకీ' పూజను నిర్వహించారు. వరుడు రోహన్ థక్కర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను అన్షులా సోషల్ మీడియాలో పంచుకుంటూ, "ప్రేమ, కుటుంబం, దేవుని ఆశీస్సులతో మా కొత్త ప్రయాణం ప్రారంభమవుతోంది" అంటూ భావోద్వేగ పోస్ట్ చేసింది.అన్షులా పెళ్లి వేడుకల్లో అన్నయ్య అర్జున్ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. తల్లి మోనా శౌరీ కపూర్ మరణం తర్వాత అన్షులాకు అర్జున్ కపూరే అండగా నిలిచారు. చెల్లెలి బాధ్యతలను తన భుజాలపై వేసుకుని కుటుంబానికి పెద్దగా వ్యవహరించిన అర్జున్, ఇప్పుడు ఆమె పెళ్లి ఏర్పాట్లను కూడా దగ్గరుండి చూసుకుంటున్నారు. ఒకప్పుడు బోనీ కపూర్ రెండో భార్య శ్రీదేవి కుమార్తెలైన జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లతో అర్జున్, అన్షులాల మధ్య పెద్దగా అనుబంధం లేదనే వార్తలు వినిపించేవి. అయితే శ్రీదేవి మరణం తర్వాత ఈ నలుగురు తోబుట్టువులు మరింత దగ్గరయ్యారు. ఇప్పుడు అన్షులా పెళ్లి వేడుకల్లో ఆ అనుబంధం స్పష్టంగా కనిపిస్తోంది.జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లు పెళ్లి ఏర్పాట్లలో చురుకుగా పాల్గొంటూ అక్కకు అండగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేస్తూ, డాన్సులు చేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా మారారు. సోనమ్ కపూర్, రియా కపూర్‌లతో కలిసి ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డిన్నర్ వేడుకకు సంజయ్ కపూర్, మహీప్ కపూర్‌తో పాటు కపూర్ కుటుంబ సభ్యులందరూ హాజరయ్యారు. బాలీవుడ్ నెక్స్ట్ జనరేషన్ సెలబ్రిటీలు కూడా ఈ వేడుకల్లో సందడి చేశారు.

## 'వారణాసి' షూట్‌కు బ్రేక్ ఇచ్చిన మహేష్ బాబు... జూలై నుంచి మళ్లీ సెట్స్‌లోకి!



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు తాజాగా చిన్న విరామం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రీసెంట్‌గా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహేష్ బాబు తన భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి కనిపించారు. ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబంతో కలిసి కనిపించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వారణాసి' షూటింగ్‌కు మహేష్ బాబు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు స్పష్టమైంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, మహేష్ బాబు జూలై 1, 2026 నుంచి మళ్లీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. వరుసగా నెలల తరబడి షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం కుటుంబంతో కొంత సమయం గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు పాత్రల గురించి వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాలో ఆయన 'రుద్ర' పాత్రలో కనిపించడమే కాకుండా, శ్రీరాముడి పాత్రలో కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్లు, అడ్వెంచర్ సన్నివేశాలు సినిమా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక ఈ చిత్రంలో 'మందాకిని' పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కె.ఎల్. నారాయణ నిర్మిస్తుండగా, ఎస్ఎస్ కార్తికేయ కూడా నిర్మాణ బాధ్యతల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. సుమారు రూ.1300 కోట్లకు పైగా బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి స్వరాలు సమకూరుస్తుండగా, కథను విజయేంద్ర ప్రసాద్ అందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు దేవా కట్టా సంభాషణలు రాస్తున్నారు. రాజమౌళి విజన్‌కు అనుగుణంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ముఖ్యంగా ఈ చిత్రాన్ని పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం.

## రూ.100 కోట్లతో రాపో23

### రామ్ పోతినేని పాన్ ఇండియా ప్లాన్, టాప్ టీమ్ ఫిక్స్!

యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రాపో23 చిత్రం తెరకెక్కబోతున్నట్లు సమాచారం. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ పోతినేని ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా నిర్మిస్తున్నారు. రామ్ ఇమేజ్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా ఈ ప్రాజెక్ట్‌ను అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ స్కేల్‌లో ప్లాన్ చేశారు. ఇప్పటివరకు రామ్ కెరీర్‌లో చేయని విధంగా యాక్షన్, ఎమోషన్, గ్రాండియర్ కలబోసిన కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం కోసం ఏకంగా రూ.100 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలుస్తుంది. దీంతో టాలీవుడ్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాల్లో ఒకటిగా రాపో23 నిలవనుంది. బడ్జెట్‌కే తగ్గట్టుగా ఈ సినిమా కోసం ఇండియన్ సినిమాలోని టాప్ టెక్నీషియన్స్‌ను రంగంలోకి దించబోతున్నారు. నేషనల్ అవార్డు గ్రహీత, స్టార్ సినిమాటోగ్రాఫర్ తిరు ఈ చిత్రానికి విజువల్స్ అందిస్తుండగా, హాలీవుడ్ రేంజ్ యాక్షన్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన పీటర్ హెయిన్ హై వోల్టేజ్ ఫైట్ సీక్వెన్స్‌లను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే పీటర్ హెయిన్ టీమ్‌తో భారీ యాక్షన్ బ్లాక్స్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయి. ఇక ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శివార్లలో భారీ సెట్స్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఒక సిటీ సెట్‌తో పాటు కీలకమైన యాక్షన్ ఎపిసోడ్స్ కోసం స్పెషల్ సెట్స్ వేస్తున్నారు. కళ్లు చెదిరే యాక్షన్ ఎపిసోడ్స్, రిచ్ ప్రొడక్షన్ డిజైన్, వరల్డ్ క్లాస్ టెక్నీషియన్స్ కలయికలో వస్తున్న రాపో23 రామ్ పోతినేని కెరీర్‌లో గేమ్ ఛేంజర్ అవుతుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ చిత్రంలో నటించే ఇతర నటీనటులు, హీరోయిన్, మ్యూజిక్ డైరెక్టర్ వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉండగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది.



## 'ఛావా' దర్శకుడి కొత్త ప్రయోగం.. శ్రద్ధ కపూర్ 'ఈత' టీజర్ విడుదల!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచుకుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.



Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com